క్లుప్తంగా

బాలుడి వైద్యానికి సాయం



బాలుడి తల్లిదండ్రులకు సాయం చేస్తున్న సంఘ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు

కొత్తపేట: అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడికి మండల శెట్టిబలిజ యువజన సంఘం ద్వారా రూ.50 వేలు అందజేసినట్లు ఆ సంఘ అధ్యక్షుడు బొక్కా ప్రసాద్ తెలిపారు. వెదిరేశ్వరం శివారు మూలగూడెం గ్రామానికి చెందిన ఇళ్ల వెంకటేశ్వరరావు, నాగలక్ష్మి దంపతుల నాలుగు నెలల కుమారుడు లఖిల్ లివర్ వ్యాధి బారిన పడ్డాడు. అతనికి లివర్ శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. అందుకు సుమారు రూ.25 లక్షలు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఆ దంపతులు దాతలను ఆశ్రయించారు. ఈ మేరకు శెట్టిబలిజ యువజన సంఘ సభ్యులు రూ.50 వేలు సేకరించి బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు. సంఘ గౌరవాధ్యక్షుడు యనమదల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శీలం కొంబాబు, కోశాధికారి మామిడిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ సురక్షితం



వాడపాలెం హైస్కూల్‌లో మాట్లాడుతున్న న్యాయవాది ప్రభాకరరావు

కొత్తపేట: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం సురక్షితమని సీనియర్ న్యాయవాది అడబాల ప్రభాకరరావు అన్నారు. స్థానిక సీనియర్, జూనియర్ సివిల జడ్జిల కోర్టుల ద్వారా న్యాయ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం వాడపాలెం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వాహన డ్రైవింగ్, పాటించాల్సిన జాగ్రత్తలపై వివరించారు. జరుగుతున్న ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడంతోనే అనేకమంది మృత్యువాత పడుతున్నారని ప్రభాకరరావు తెలిపారు. అందువల్ల వాహనాలు నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చునే వారూ హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. అనంతరం ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయుడు అంబటి జీవరత్నం పాల్గొన్నారు.

కలవరపెడుతున్న కుక్కలు



కుక్కల దాడిలో గాయపడిన గేదె పెయ్య

మామిడికుదురు: విచ్చలవిడిగా పెరిగిన కుక్కలు ప్రజలను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. మనుషులతో పాటు పశువులపై కూడా ఇవి దాడి చేస్తున్నాయి. అప్పనపల్లిబాడవలో గురువారం కామిశెట్టి సుబ్రహ్మణ్యంకు చెందిన గేదె పెయ్యపై కుక్కలు విచక్షణారహితంగా దాడి చేశాయి. గేదెను ఎక్కడికక్కడ కొరికేయడంతో తీవ్రంగా గాయపడింది. దానికి రైతు చికిత్స చేయించారు. కుక్కలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి



అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ముంగండపాలెం శివారు కారుపల్లిపాడులో జగ్జీవన్‌రామ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ శృంగవరపు లక్ష్మణరావు, మల్లవరపు వెంకన్న పాల్గొన్నారు. అనంతరం పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యనారాయణ విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు.

మారుతి చరణ్ స్వామీజీ కైవల్య ప్రాప్తి

అయినవిల్లి: అయినవిల్లి మండలం కె.జగన్నాథపురం గ్రామంలోని బ్రహ్మచారి స్వామి మారుతి చరణ్ (84) గురువారం కైవల్య ప్రాప్తి పొందారు. రామనామ జపాన్ని గ్రామ గ్రామాన వ్యాపింపజేయడానికి మాగం గ్రామంలో 45 ఏళ్ల కిందట మారుతి చరణ్ ధర్మానుష్ఠాన ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. సూర్యానంద స్వామి, శ్రీలంక బౌద్ధ భిక్షువు బోధి హీన తదితర వేలాది మంది సత్సంగ సభ్యుల ఆధ్వర్యంలో, స్వామి భక్తుల సమక్షంలో రామరామ నామ జపాన్ని జపిస్తూ ఆశ్రమంలో మహా సమాధి చేశారు.

సుజలం... సుఫలం

- గ్రామాల్లో తాగునీటి వెతలకు చెక్
- మణిహారంలా జల్‌జీవన్ మిషన్ పనులు
- గత వైఎస్సార్ సీపీ హయాంలోనే బాటలు

సఖినేటిపల్లి: తాగునీరు.. మనిషికి ఎంతో అవసరం. దీనిని గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సఖినేటిపల్లి మండలంలోని సముద్ర తీరాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు చర్యలు చేపట్టింది. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా సమగ్ర రక్షిత తాగునీటి పథకం మంజూరు చేసింది. ఇది తీరానికే మణిహారంగా మారింది. దీనిద్వారా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో అంతర్వేది దేవస్థానంలోని 12 ఎకరాల చెరువును జేజేఎంలో రూ.17.33 కోట్లతో సమగ్ర రక్షిత తాగునీటి ప్రాజెక్ట్‌గా తీర్చిదిద్దేందుకు మార్గం సుగమం చేశారు. గతేడాది జూన్ నుంచి ఈ ప్రాజెక్ట్ పనులను అధికారులు చేపట్టారు. తీర ప్రాంతంలోని ప్రతి ఇంటికి అవసరమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో 20 ఏళ్ల భవిష్యత్ అవసరాల దృష్టిలో ఉంచుకుని జల్‌జీవన్ మిషన్ ద్వారా పనులకు నాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఈ పథకం తీరప్రాంత ప్రజలకు చిరకాలంగా ఉన్న దాహార్తి సమస్యకు పరిష్కారం చూపనుంది. తీరంలో అంతర్వేదికర, అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం, గొంది గ్రామాల్లోని 13 ఆవాసాల్లోని 21,600 మంది జనాభాకు రక్షిత తాగునీరు అందించాలనేది ఈ పథకం ముఖ్యోద్దేశం.

పనులు.. ప్రగతి

చెరువు చుట్టూ 4 మీటర్ల ఎత్తులో రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేశారు. పొడవు 220 మీటర్లు, వెడల్పు 180 మీటర్లతో ఏర్పాటు చేసిన ఈ



అంతర్వేది దేవస్థానంలో చెరువుకు నల్ల రేగడితో వేస్తున్న బెడ్ కార్పెట్ పనులు (ఫైల్)

చెరువులో 1,34,640 క్యూబిక్ మీటర్ల ఘన పరిమాణంలో నీటిని నిల్వ చేసే దిశగా రిటైనింగ్ వాల్ నిర్మాణం జరిగింది. చెరువులో నిల్వ చేసే నీరు ఇంకిపోకుండా ఉండేందుకు బెడ్ కార్పెట్‌గా 70 సెంటీమీటర్ల ఎత్తులో నల్ల రేగడిని వేసే పనులను ఇప్పటికే అధికారులు ప్రారంభించారు. అయితే ఇటీవల కాలంలో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో ఈ పనులకు కొంత అంతరాయం ఏర్పడింది. ఇక్కడ భూమిలో లవణీయత శాతం ఎక్కువగా ఉండడంతో దానికి అనుగుణంగా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఇన్‌టేక్ వెల్ నిర్మాణం

జేజేఎంలో సిద్ధం చేస్తున్న చెరువుకు పి.గన్నవరం ప్రధాన పంట కాలువ ద్వారా నీటిని పంపింగ్ చేయనున్నారు. ఇందుకు అవసరమైన ఇన్‌టేక్ వెల్ నిర్మాణ పనులను సఖినేటిపల్లి మూడు తూములు సెంటర్ వద్ద ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ చేపట్టింది. ఇన్‌టేక్ వెల్ నుంచి నీటి సరఫరాకు ప్రాజెక్ట్ వరకూ 12 కిలోమీటర్ల మేర పైపులైన్ వేశారు. ప్రాజెక్ట్‌కు సమీపంలో 30 మీటర్ల ఎత్తులో 60 వేల లీటర్ల కెపాసిటీ గల ఓహెచ్‌బీఆర్ నిర్మాణం చేపట్టారు. అలాగే నిర్మాణంలో ఉన్న 3 ఎంఎల్‌డీ ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్ ద్వారా రోజుకు 3 మిలియన్ల లీటర్ల నీటిని శుద్ధి చేసే ప్రక్రియ జరుగనుంది. సమీపంలో నిర్మించే 250 కిలోలీటర్ల కెపాసిటీ సంపులో శుద్ధి చేసిన నీటిని నిల్వ చేయనున్నారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే ఉన్న ఓహెచ్ఎస్ఆర్‌లకు అదనంగా జేజేఎంలో నిర్మించిన మరో 19 ఓహెచ్ఎస్ఆర్‌లను ప్రాజెక్ట్ పరిధిలోకి తెచ్చారు.



అంతర్వేది దేవస్థానంలో ప్రాజెక్ట్ వద్ద ఓహెచ్‌బీఆర్ ట్యాంకు నిర్మాణం

ప్రతి ఇంటికీ తాగునీరు



జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించాలన్నదే లక్ష్యం. ఈ పథకం పూర్తి కావడానికి ఇంకా 18 నెలలు సమయం పడుతోంది. ఇంత వరకూ 50 శాతం ప్రాజెక్ట్ పనులు పూర్తి చేశాం. వర్షాలతో కొంత అంతరాయం ఏర్పడింది. త్వరగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–కె.లక్ష్మీ శిరీష, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, సఖినేటిపల్లి

తీరానికే మణిహారం



మండలంలో తీర ప్రాంత వాసుల దాహార్తి తీర్చేందుకు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.17.33 కోట్లు కేటాయించారు. దీని ద్వారా రానున్న రోజుల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందనుంది. ఈ ప్రాజెక్ట్ తీరానికే మణిహారం కానుంది.

–రాపాక వరప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే, రాజోలు

ఆందోళన కలిగిస్తున్న టీడీపీ దాడులు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేత ముసునూరి



కొత్తపేట: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతూ సృష్టిస్తున్న భయానక వాతావరణం ఆందోళన కలిగిస్తుందని రాష్ట్ర వైఎస్సార్ సీపీ మాజీ ప్రచార కార్యదర్శి, పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ ముసునూరి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో రాజకీయ పార్టీల జయాపజయాలు సహజమని అన్నారు. అయితే అధికారంలోకి వచ్చాం కదా.. అని ప్రత్యర్థి పార్టీపై దాడులకు పాల్పడటం గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. నేడు టీడీపీ ప్రభుత్వంలో కొత్త సంస్కృతికి తెరలేపారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం, హత్యలు, హత్యాయత్నాలకు పాల్పడటం, దివంగత మాజీ సీఎం వైఎస్సార్ విగ్రహాలు, గత ప్రభుత్వంలో అభివృద్ధి పథకాల శిలాఫలకాలు ధ్వంసం చేయడం దురదృష్టకరమన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంచిన ఇసుకను ఇప్పుడు ఉచితమని చెప్పి దోచుకుంటున్నారన్నారు.

23 నుంచి ఆధార్ శిబిరాలు

మామిడికుదురు: మామిడికుదురు మండలంలో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకూ ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీఓ ఎస్.వేణుగోపాలరెడ్డి, ఏఓ కె.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. 23న కరవాక, లూటుకుర్రు, 24న గోగన్నమఠం, కొమరాడ, 25న మగటపల్లి, మొగలికుదురు, 26న ఈదరాడ, పెదపట్నం, 27న పాశర్లపూడిలంక, మామిడికుదురు–2 గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ఆలమూరు: సంధిపూడి ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు వెల్ల రామ్మూర్తి సహకారంతో నోట్ పుస్తకాలు, పెన్సిళ్లను అందజేశారు. హెచ్ఎం శ్రీనివాసరావు, చైర్మన్ సూరపురెడ్డి వెంకట గంగాధర్, సూరపురెడ్డి సురేష్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి హౌసింగ్ డీఈగా శ్రీనివాస్

పి.గన్నవరం: గృహ నిర్మాణ సంస్థ పి.గన్నవరం సెక్షన్ ఇన్‌చార్జి డీఈగా ధరణాల శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. శ్రీనివాస్ ఇంతకు ముందు ఆలమూరు మండల ఏఈగా పనిచేశారు. లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన అన్నారు.

గోశాలకు లిఫ్టర్ల అందజేత

అమలాపురం టౌన్: అస్వస్థత, ప్రమాదాలకు గురైన గోవులను సంరక్షించేందుకు స్థానిక గౌతమ మహర్షి గోసంరక్షణ సమితి గోశాలకు మూడు లిఫ్టర్లను దాతలు సమకూర్చారు. మూడు లిఫ్టర్లను రూ.95 వేల వ్యయంతో కొనుగోలు చేసి గోశాలకు అందించారు. ఇప్పటికే జబల్‌పూర్ జిల్లాకు చెందిన ఇండస్ట్రియల్ సొల్యూషన్ సంస్థ అందించిన ఒక లిఫ్టర్‌ను గోవుల సంరక్షణకు వినియోగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా బాధిత గోవులకు లిఫ్టర్ల సేవలను విస్తరించాలని గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు నిర్ణయించారు. దీంతో దాతలు ముందుకొచ్చి మూడు లిఫ్టర్లను సమకూర్చారు. విశాఖపట్టణం జిల్లా గోపాలపట్నానికి చెందిన స్వర్ణ జ్యూయలర్స్ యాజమాని జూపూడి రంగనాయకులు, హనుమన్ జ్యూయలర్స్ యాజమాని శేట్ మహావీర్‌లు ఒక లిఫ్టర్, కాకినాడకు చెందిన శ్రీకృష్ణ పరివార్ వ్యవస్థాపకులు సుధా మాధురి మరో లిఫ్టర్, అమలాపురం శ్రీరామానందస్వామి ట్రస్ట్ ఇంకో లిఫ్టర్‌ను విరాళంగా సమకూర్చారు. గోశాల ప్రతినిధులు లింగోలు విస్సు, కేవీ మావుళ్లయ్య, పి.నాగకనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే కుష్ఠు నివారణ



అంబాజీపేటలో కుష్ఠు వ్యాధిపై అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి గౌతమి

ఆలమూరు: అవగాహనతో కుష్ఠు వ్యాధిని నివారించవచ్చని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పిలుపునిచ్చారు. కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలను పురస్కరించుకుని ఆయా పీహెచ్‌సీల పరిధిలో వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున్, డి.సాయికిశోర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది గురువారం ర్యాలీలు నిర్వహించారు. కుష్ఠు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెచ్ఈలు బి.జ్యోతికుమార్, ఏవీవీ రాజా, ఎంపీహెచ్ఈఎస్ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ పాల్గొన్నారు.

అంబాజీపేట: లక్షణాలను బట్టి కుష్ఠు వ్యాధిని గుర్తించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి వి.గౌతమి అన్నారు. అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఈ వ్యాధిపై ఆరోగ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు వ్యాధి నివారణపై పోస్టర్లు ఆవిష్కరించారు. పీహెచ్ఎన్ కె.రత్నకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.మధుబాబు, హెల్త్ అసిస్టెంట్ వి.మురళీ, జీవీవీకే ప్రసాద్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



కొత్తపేటలో స్టూడెంట్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు, ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: చిన్నప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సాగితే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండల స్థాయిలో స్టూడెంట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమం గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద జరిగింది. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులకు ఎమ్మెల్యే బండారు స్టూడెంట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు, సర్పంచులు బూసి జయలక్ష్మి, త్సామా బాబు పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం సువర్ణ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ఎమ్మెల్యే సత్యానందరావు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు.

రాజోలు: స్థానిక బాలుర, బాలికోన్నత, చింతలపల్లి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ కేతా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మట్టా శైలజ, మండల ఉపాధ్యక్షుడు ఇంటిపల్లి ఆనందరాజు, ఎంఈఓ నల్లి మనోహరం, ఎంపీటీసీ దార్ల కుమారిలక్ష్మి పాల్గొన్నారు.

మలికిపురం: రామరాజులంక, పడమటిపాలెం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన స్టూడెంట్ కిట్లను గురువారం పంపిణీ చేశారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, జెడ్పీటీసీ బల్ల ప్రసన్న కుమారి చేతుల మీదుగా వీటిని అందించారు. సర్పంచ్‌లు ఆకు మాధవీ నాగలక్ష్మి, కాకార శ్రీనివాస్, ముద్దల శ్రీనివాస్, మేడిచర్ల రాము పాల్గొన్నారు.

వైద్యానికి ఇరుకాటం

అంబాజీపేట: ముక్కామల పీహెచ్‌సీలోని ఇరుకు గదుల్లోనే వైద్య సేవలు అందించాల్సి వస్తుంది. ఈ ఆసుపత్రికి ఏడు గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. రోగులకు పరీక్షలు చేసేందుకు, వైద్యం అందించేందుకు తగిన గది లేక పీహెచ్‌సీ వరండాను ఆనుకుని రేకుల షెడ్డును నిర్మించారు. రోగులకు అక్కడే పరీక్షలు చేయడం, మరోపక్క సిలైన్ ఎక్కించడం, ఇంజెక్షన్లు చేస్తున్నారు. గర్భిణులకు పరీక్షలు చేయాలన్నా, వచ్చే రోగులకు వైద్య సేవలందించాలన్నా సరైన వసతి లేక ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడి జెడ్పీ హైస్కూల్ సమీపంలో పీహెచ్‌సీ నూతన భవనాన్ని నిర్మించేందుకు రూ.1.20 కోట్లు మంజూరు కాగా, స్థలం వివాదంతో పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలి.



ముక్కామలలో రేకుల షెడ్డులోనే వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

కరవు కాటకాల నుంచి కాపాడే శాకంబరి



వక్కలంకలో ప్రవచిస్తున్న శంకర్‌గౌడ్

అంబాజీపేట: ఆషాఢ మాసంలో అమ్మవారిని శాకంబరిగా కొలిస్తే ప్రజలను కరవు కాటకాల నుంచి కాపాడి అన్న పానాదులను ప్రసాదిస్తుందని ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్ శంకర్‌గౌడ్ అన్నారు. వక్కలంకలో శ్రీరామాలయం వద్ద ఆలయ కమిటీ, లోకాస్సమస్తా సుఖినో భవంతు ఆధ్యాత్మిక సంస్థ, విశ్వహిందూ పరిషత్‌ల ఆధ్వర్యంలో కుమార్‌శంకర్ గౌడ్‌చే ఆధ్యాత్మిక ప్రవచనాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేలంగి మాట్లాడుతూ ఆషాఢ మాసంలో తొలి ఏకాదశి రోజున విష్ణుమూర్తిని పూజిస్తే జ్ఞానం, ముక్తి లభిస్తాయన్నారు. అనంతరం కుమార్ శంకర్‌గౌడ్‌ను కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక సంస్థ సభ్యులు గొవ్వాల అచ్యుతరామయ్య, వీహెచ్‌పీ మండల ధర్మరక్షక్ కడలి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు రాజేష్, మహేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధన కోసమే శిక్షణ

అమలాపురం రూరల్: విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకే ఉపాధ్యాయులు, సీఆర్పీలకు టీచ్ టూల్ శిక్షణ అందిస్తున్నట్లు డీవైఈవో సూర్యప్రకాశరావు అన్నారు. పేరూరు జిల్లా జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమానికి సర్వశిక్ష అభియన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మధుసూదన్‌రావు హాజరయ్యారు.

పొలం... జలమయం

- వానలతో ఇబ్బంది
- స్తంభించిన జనజీవనం

మామిడికుదురు/ అంబాజీపేట/ ఆలమూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. మామిడికుదురు మండలంలోని పలు ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. ప్రధాన రహదారులతో పాటు లింకు రోడ్లపై ముంపు నీరు చేరింది. మామిడికుదురు, నగరం, పాశర్లపూడి 216వ నంబర్ జాతీయ రహదారిపై పలుచోట్ల రెండడుగుల మేర నీరు నిలిచిపోయింది. మొగలికుదురు, పెదపట్నం, గెద్దాడ, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడిలంక, లూటుకుర్రు, ఆదుర్రు, మాకనపాలెం, ఈదరాడ, మగటపల్లి, గోగన్నమఠం గ్రామాల్లోని పలు రోడ్లపై అదే పరిస్థితి. భారీ వర్షాలకు మామిడికుదురు, గెద్దాడ, నగరం, పాశర్లపూడి, ఈదరాడ, పెదపట్నం తదితర గ్రామాల్లోని నారుమడులు ముంపునీట ఉన్నాయి. అసలే నాట్లు ఆలస్యం కావడంతో ఇబ్బంది పడుతున్న రైతులకు భారీ వర్షం మరింత సమస్యగా మారింది. అంబాజీపేట మండలంలో తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో రహదారులపై నీరు నిలిచిపోయింది. అంబాజీపేట హైస్కూల్ ప్రాంగణం నీట మునిగింది. వర్షాలకు ఆలమూరు మండలంలోని పల్లపు ప్రాంతాల్లో వరిచేలు నీట మునిగాయి. గుమ్మిలేరు, మోదుకూరు, పెదపళ్ల గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో వరి చేలు చెరువులను తలపించాయి. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రైతులు కలవరపాటుకు గురవుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వరినాట్లు కుళ్లిపోయి తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటుక బట్టీలు మరో వారం రోజుల పాటు తెరిచే అవకాశం లేకపోవడంతో కార్మికుల జీవనోపాధి దూరమైంది. కొత్తూరు– వెదురుమూడి రోడ్డులోని బెర్మలు దారుణంగా దెబ్బతిన్నాయి. అసలే ఇరుకు రోడ్డుపై భారీ గోతులు పడడంతో ప్రమాదభరితంగా మారింది.

అయినవిల్లి: అయినవిల్లి, నేదునూరు, నల్లచెరువు, సిరిపల్లి, విలస, మడుపల్లి, వెలవలపల్లి, మాగాం తదితర గ్రామాల్లో 50 శాతం వరి నాట్లు పూర్తయ్యాయి. వర్షాలకు వరి నారుమడులు, నాట్లు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. అయినవిల్లిలోని న్యూకాలనీ, తొత్తరమూడి, విలస, సిరిపల్లి, మాగం, పోతుకుర్రు, కె.జగన్నాథపురంలోని పలు కాలనీలు ముంపునీటిలో చిక్కుకున్నాయి.

పి.గన్నవరం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో మండలంలో జనజీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు, కాలనీలు జలమయమయ్యాయి.



గుమ్మిలేరులో వర్షాలకు నీట మునిగిన వరి చేను



అయినవిల్లి న్యూ కాలనీలో ముంపునీరు



మామిడికుదురులో ముంపునకు గురైన నారుమడి

ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు

మామిడికుదురు: ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు నిర్మించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామని లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాతకాపు తెలిపారు. గ్రామంలోని శెట్టిబలిజ ప్రాంతంలో రామాలయం వద్ద 15వ ఆర్థిక సంఘం నిధులతో రెండు సీసీ రోడ్లకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రూ.6 లక్షలతో నాలుగు రోడ్లు నిర్మిస్తామన్నారు. ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

కేసు ఉపసంహరణ

మలికిపురం: స్థానిక ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాల ఫీజుల విషయంలో తాము కోర్టులో వేసిన కేసును ఉపసంహరించుకున్నట్లు కె.వీరమణికంఠ, టి.నవీన్, ఎంహెచ్ నాగవెంకట సతీష్ బుధవారం తెలిపారు. ఈ ఎయిడెడ్ కళాశాలను ప్రభుత్వానికి అప్పగిస్తూ పాలకవర్గం నిర్ణయం తీసుకోవడం, ఇందులోని సిబ్బందిని ప్రభుత్వ విద్యాసంస్థలకు తరలించరాదని దాతల కుటుంబాలు కేసు వేశాయి. అయితే కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం వంటి చర్యలతో ప్రస్తుతం కళాశాల ప్రైవేటు సంస్థగా నిలిచిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో కళాశాలలో ప్రభుత్వ ఫీజులు మాత్రమే వసూలు చేయాలని కోరుతూ పై ముగ్గురు విద్యార్థులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు కళాశాలలో తక్కువ ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. దీంతో కళాశాలపై ఆర్థిక భారం పడింది. అందులో పనిచేస్తున్న అధ్యాపకులు, సిబ్బందికి కనీస జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో కళాశాల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని విద్యార్థులు తెలిపారు. కళాశాలను కాపాడుకోవాలన్న ఉద్దేశంతోనే తాము వేసిన కేసును ఉపసంహరించుకున్నట్లు మణికంఠ, నవీన్, సతీష్ వెల్లడించారు.

పీడీ పోస్టులు పునరుద్ధరించాలి

సఖినేటిపల్లి: పీడీ పోస్టులను పునరుద్ధరించాలని జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో కలపడంతో పీడీ పోస్టులతో పాటు, జీహెచ్ఎంఎస్ పోస్టులు కూడా రద్దు చేశారన్నారు. విద్యార్థులకు మేలు చేకూర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.